ప్రజాశక్తి
మంగళవారం ఏప్రిల్ 16 2024 8 పేజీలు
శ్రీకాకుళం

హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు (6లో)

జీడికి మద్దతు ధర కల్పిస్తాం

- జీడి బోర్డు ఏర్పాటుకు చర్యలు
- ఐటిడిఎ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటా
- కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- అప్పలరాజును అడవులకు సాగనంపాలి
- టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

జీడి పంటకు కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పలాసలో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జీడి రైతులకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు దక్కాల్సి ఉండగా రూ.7 వేలే వస్తుందన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఉద్దానంలో ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించడంతో పాటు ఇక్కడి పంటలపై పరిశోధన చేయించి కిడ్నీ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వం పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయకుండా నాటకాలు ఆడుతోందని విమర్శించారు. పలాస నియోజకవర్గానికి సాగునీటి కోసం వంశధార ఆధునికీకరణ పనులు చేపడతామన్నారు. పలాసలో డిఫెన్స్ అకాడమీతో పాటు సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జాతీయ రహదారికి సమాంతరంగా భావనపాడు నుంచి విశాఖపట్నం వరకు బీచ్ రోడ్ నిర్మించి పరిశ్రమలు, పర్యాటక రంగానికి ప్రోత్సహిస్తే ఇక్కడ యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గోదావరి నీళ్లు వంశధారకు, వంశధార జలాలు బాహుదా నదికి తీసుకెళ్తే జిల్లాకు సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. యువతకు (మిగతా...2లో)

ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజాగళం సభలో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

'ఇండియా' ఫోరాన్ని గెలిపించాలి

- 18న నాగభూషణరావు నామినేషన్
- తరలిరావాలని 'ఫోరం' నాయకుల పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశాన్ని సర్వ నాశనం చేసి, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని నట్టేట ముంచిన బిజెపి, దానితో జత కట్టిన టిడిపి, జనసేన, నిరంకుశ వైసిపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పైడి నాగభూషణరావు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ రక్షణకు, రాష్ట్రాభివృద్ధికి (మిగతా...2లో)

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల విధులపై పూర్తి అవగాహనతో ఉన్నప్పుడే ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్లు ప్రతి అంశాన్ని త్వరగా అవగాహన చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేటప్పుడు వారి సందేహాలను నివృత్తి చేయాలని, అందుకు ముందుగా తాము (ఎఎల్ఎంటిలు) తీసుకుంటున్న శిక్షణలోని ప్రతి అంశంపై పట్టు సాధించాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఎంత అవగాహనతో పనిచేస్తే ఎన్నికలు అంత బాగా జరుగుతాయన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఇవిఎం ఆపరేట్ చేయడం, (మిగతా...2లో)

రాజధానిగా విశాఖ ఎందుకు వద్దో చెప్పాలి

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

పరిపాలనా రాజధానిగా విశాఖపట్నంను ఎందుకు వద్దన్నారో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని ప్రగతి భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖలో ఎన్నో వనరులు ఉన్నాయని, అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. విశాఖ రాజధాని అయితే ఎన్నో పరిశ్రమలు వచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. 2018లో చంద్రబాబు ఎపి పెర్ఫార్మెన్స్ అప్రైజర్ ఇండెక్స్ పుస్తకం విడుదల చేశారని, అందులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు వెనుకబడి ఉన్నాయని ఆయనే చెప్పారని గుర్తుచేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఉత్తరాంధ్రను ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తే ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయన్నారు.

టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతి పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని విమర్శించారు. ఆయన అనుచరులకు, సామాజిక తరగతికి చెందిన వారికి భూములు కట్టబెట్టారని ఆరోపించారు. వారి చేతుల్లో రాజధాని బందీగా ఉండాలా, దాన్ని మనం అంగీకరించాలా అన్నది మేధావులు, విద్యావంతులు ఆలోచన చేయాలన్నారు. వైసిపి మళ్లీ అధికారంలోకొస్తే విశాఖ రాజధాని ఖాయమన్నారు. 14 ఏళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు ఐదేళ్ల పాలనలో జగన్ చేసి చూపించారని చెప్పారు.

త్వరితగతిన ఛార్జిషీట్ల దాఖలు (2లో)

రేపట్నుంచి ఎస్ఎఫ్ఐ మోడల్ ఎంసెట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 17, 18, 19 తేదీల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తెలిపారు. మోడల్ ఎంసెట్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షను ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో చాలామంది విద్యార్థులు ఎంసెట్ కోసం కోచింగ్ తీసుకొని పరీక్షకు నేరుగా వెళ్లి ఆందోళనకు గురై సరిగ్గా పరీక్ష రాయలేకపోయే వారికి ఇది మంచి అవకాశమన్నారు. విద్యార్థుల కోసం పోరాటాలు మాత్రమే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉండే అకుంఠిత ప్రతిభను వెలికితీసి, వారి జీవితాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దిశానిర్దేశం చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ పరీక్ష, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షలంటే భయం పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి దువ్వాడ శ్రీకాంత్ రాజీనామా

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పలాస

వైసిపికి ఎమ్మెల్సీ, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సోదరుడు దువ్వాడ శ్రీకాంత్, ఆయన భార్య, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దువ్వాడ జయశ్రీ రాజీనామా చేశారు. పలాస టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు సమక్షంలో వారు టిడిపిలో చేరారు. చంద్రబాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలో అవమానాలు భరించే శక్తి లేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన వెంటనే తానూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి జిల్లా నుంచి ఆయనకు మద్దతు పలికిన మొట్టమొదటి వ్యక్తినన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణం వరకూ మంత్రి సీదిరి అప్పలరాజును తాను పరిచయం చేశానన్నారు. తనను మూడేళ్లుగా అన్నివిధాలుగా తొక్కే ప్రయత్నం చేశారని చెప్పారు. తాను వైసిపి పట్టణ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఒక్క కార్యక్రమానికీ ఆహ్వానించలేదన్నారు. ఇంకా అవమానాలు పడుతూ పార్టీలో ఉండలేక రాజీనామా నిర్ణయం తీసుకున్నామన్నారు.

త్వరితగతిన ఛార్జిషీట్ల దాఖలు

శ్రీకాకుళం : జైల్లో ఉన్న నిందితుల కేసుల్లో ఛార్జిషీట్లను త్వరితగతిన దాఖలు చేయాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. నిందితుల కేసుల వివరాల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్లో ముద్దాయిలు ఎక్కువ రోజుల పాటు మగ్గుతున్నారని, అటువంటి వారిపై విచారణ సమగ్రంగా చేపట్టి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర ఫణికుమార్, అడిషనల్ సివిల్ జడ్జి అనురాధ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పిస్తాం

వర్క్ ఫ్రం హోం ద్వారా ఉపాధి కల్పిస్తామని, ఇందుకోసం పలాసలో వర్కు స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అప్పలరాజును అడవులకు సాగనంపాలి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో రుషికొండను బోడి గుండు చేయిస్తే, ఇక్కడ మంత్రి సీదిరి అప్పలరాజు సూదికొండ, నెమలికొండ, నల్లబొడ్డూరు కొండలను మింగేయడంతో కొండల్లో ఉన్న ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. మంత్రి అప్పలరాజును అడవికి పంపితే గానీ ఇక్కడ ప్రజలకు రక్షణ ఉండదన్నారు. రాజకీయాలు అంటే నోరు పారేసుకోవడం కాదని మండిపడ్డారు. పలాసలో ఆక్రమించుకున్న భూములను తిరగదోడి ఎవరి భూములను వారికి అప్పగిస్తామన్నారు.

అప్పలరాజును ప్రజలే శిక్షిస్తారు : ఎంపీ

పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా కాలక్షేపం చేసిన మంత్రి సీదిరి అప్పలరాజును ప్రజలు శిక్షించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరు లేదన్నారు. పలాసలో మంత్రి అప్పలరాజు కాదు కొండల రాజు అని, భూములు మింగేస్తున్నారని ఆరోపించారు. మంత్రి అప్పలరాజు జీడి సమస్యను ఎందుకు పరిష్కరించలేదో చెప్పాలన్నారు. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేసే జిఒను రద్దు చేశారని విమర్శించారు. ఆఫ్‌షోర్‌లో ఒక్క రూపాయి పని జరగలేదన్నారు. అప్పలరాజు ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు.

మత్స్యకారులకు పథకాలు ఆపేశారు : శిరీష

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, సంక్షేమ పథకాలను ఆపేసిందని పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. జిల్లాలో ఉన్న ఐటిడిఎ పక్క జిల్లాకు వెళ్లిపోతున్నా వైసిపి నాయకులు ఆపలేకపోయారని విమర్శించారు. ఐదేళ్లుగా శివారు భూములకు వంశధార నీరు అందించలేకపోయారని విమర్శించారు. ఉద్దాన

మొదటి పేజీ తరువాయి

ప్రాంతంలో సాగు చేస్తున్న జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని కోరారు. మందస ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్లు కనీసం మరమ్మతులు చేపట్టలేదన్నారు. మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబును కోరారు. జిల్లాలో పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, పరిశ్రమలను స్థాపించాలన్నారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి ప్రాంతాల్లో సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్దాన ప్రాంతంలో యువత ఎక్కువగా డిఫెన్స్‌లో పని చేస్తున్నారని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాగళం సభలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబు పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి ఇందిరాచౌక్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆయనకు టిడిపి నాయకులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, జోనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి అభ్యర్థులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, జనసేన నాయకులు దానేటి శ్రీధర్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

'ఇండియా' ఫోరాన్ని గెలిపించాలి

'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా ధనాన్ని, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి రూ.లక్షల కోట్ల ఆస్తులను అంబానీ, అదానీలకు అప్పగిస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన చట్టబద్ధమైన హామీలను మోడీ ప్రభుత్వం అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. కేసులకు భయపడి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన బిజెపికి కొమ్ము కాస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జతకట్టడం ఘోరమైన తప్పిదమన్నారు. ఐదేళ్ల పాటు బిజెపి అడుగులకు మడుగులొత్తి వైసిపి ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, పోలవరం నిర్మాణానికి నిధులు వంటి అనేక హామీలను అమలు చేయడంలో, చేయించుకోవడంలో ఈ పార్టీలు విఫలమయ్యాయన్నారు. అటువంటి పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే 'ఇండియా' ఫోరం అభ్యర్థులను ఆదరించాలని కోరారు. శ్రీకాకుళం నియోజకవర్గ ఇండియా ఫోరం అభ్యర్థి నాగభూషణరావు ఈనెల 18న నామినేషన్ వేస్తున్నారని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కె.మోహనరావు, సిపిఐ నాయకులు టి.తిరుపతిరావు, కాంగ్రెస్ నాయకులు డి.గోవింద మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలను.. ప్రీ పోల్, పోలింగ్ దాని తర్వాత చేయాల్సిన పనులను విడమర్చి చెప్పాలని చెప్పారు. నిబంధనలను సంపూర్ణంగా వివరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సినవి, చేయకూడనివి స్పష్టంగా వివరించాలన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అందజేసిన పిపిటి హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఇవిఎం మిషన్లలో బ్యాలెట్ యూనిట్, వివి ప్యాడ్, కంట్రోల్ యూనిట్ అనుసంధాన ప్రక్రియ, పోలింగ్ డే రోజు మాక్ పోల్ ప్రక్రియ, ముఖ్యంగా పలు పత్రాలు నింపే విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. చాలామంది అధికారులు ఇదివరకు ఎన్నో ఎన్నికల విధులు చేశామనే నిర్లక్ష్యం చూపవద్దని చెప్పారు. ప్రతిసారి ఇసిఐ కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తోందని వివరించారు. ఎలాంటి సందేహాలు ఎదురైనా నోట్ చేసుకుని పై అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈనెల 20న మరోసారి శిక్షణ ఇస్తామని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు బి.శాంతిశ్రీ, ఎం.కిరణ్ కుమార్, శేషగిరి, కె.కిరణ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు

- **జిల్లాలో పిడబ్ల్యుడి ఓటర్లు 21,481**
- **85 ఏళ్లు దాటిన ఓటర్లు 11,485**
- **జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్**

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలింగ్ కేంద్రాల వద్ద, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తరలింపులో గానీ ఎలాంటి అసౌకర్యం కలగకూడదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్‌చైర్ల ఏర్పాటుపై రిటర్నింగ్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా పిడబ్ల్యుడి ఓటర్లు, వృద్ధులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఆదేశించారు. జిల్లాలో పిడబ్ల్యుడి ఓటర్లు 21,481 ఉండగా, 85 ఏళ్లు దాటిన వృద్ధులైన ఓటర్లు 11,485 మంది ఉన్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉన్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిడబ్ల్యుడి ఓటర్లకు అవసరమైతే ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేయాలన్నారు. వీల్ చైర్స్ ప్రస్తుతం ఎన్ని ఉన్నాయని తెలుసుకున్నారు. పోలింగ్ రోజుకు ఎన్ని అవసరమవుతుందని తెలియజేయాలని ఎడిని ఆదేశించారు. పోలింగ్ రోజున పిడబ్ల్యుడి ఓటర్లకు ప్రత్యేక వరుస ఉంటుందని చెప్పారు. ఓటర్లకు సహాయానికి ఎంతమంది అవసరమవుతారో తెలియజేయాలని డిఇఒ వెంకటేశ్వరరావు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టేబుల్స్ మరీ ఎత్తుగా లేకుండా, వీల్ చైర్‌లో కూర్చుంటే అందేవిధంగా ఉండేలా చూడాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఒక మోనటరింగ్ అధికారిని నియమించాలన్నారు. అనంతరం హోం ఓటింగ్‌కు సంబంధించి నియోజకవర్గాల వారీగా పిడబ్ల్యుడి ఓటర్లు, వృద్ధులకు సంబంధిత ఫారం-12డి పంపిణీ ఎంతవరకు జరిగిందని అడిగారు. షెడ్యూల్ ప్రకారం తక్షణమే పంపిణీ చేయాలని ఆదేశించారు. డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండాలన్నారు. రోజు వారీ నివేదికలు పంపాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఎడి కవిత, శ్రీకాకుళం ఆర్‌డిఓ, రిటర్నింగ్ అధికారి సిహెచ్. రంగయ్య, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశరావు, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్ రెడ్డి, డిఈఓ వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పిడి కిరణ్ కుమార్, వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సుభాషిణి నాయక్, చైతన్య, విభిన్న ప్రతిభా వంతులు, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I KHALLIL AHMED SARIF (OLD NAME) S/O Gafur Sarif(OLD NAME) D.NO. 2-1-272 A.S.Peta Colony, Ichapuram-532312. I Have Changed My name is **SHARIF KHALIL AHMAD** (NEW NAME) SIMILARLY CORRECTED My Father Name is SHARIF GAFUR (NEW NAME) and my Address is D.No 2-1-272 A.S.Peta Colony, Ichapuram Srikakulam Dist Andhrapradesh. **HEREAFTER** MY NAME IS KNOWN AS **SHARIF KHALIL AHMAD** (NEW NAME).

బహిరంగ వేలం

శ్రీ మహారాజశ్రీ శ్రీకాకుళం 3వ అదనపు జిల్లా జడ్జి మరియు (Family Court)
EP 327/2019 in OS 50/2015

Between:
Bhyri Muralidhara Rao ---Decree Holder/Plaintiff
And:
K. Alivelumanga alias Madhulatha ---Judgement Debtor/Defendant

పై నెంబర్ పిటిషన్‌లో డిక్రీ హోల్డర్/వాది పై కోర్టులో **OS.50/2015** నెంబరులో ప్రతివాది ఆస్తులపై దావా వేసి తేది 26-02-2018న డిక్రీ పొంది ఉన్నారు. డిక్రీ దరిమిలా సదరు జడ్జిమెంటు డేటరు ఆస్తిని వేలం జరిపించడం మూలంగా డిక్రీ పైకం రాబట్టే నిమిత్తం పై నెంబరు అమలు పిటీషను దాఖలు చేయగా సదరు అమలు పిటీషను విచారణానంతరం యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే02-05-2024ది న బహిరంగ వేలం వేయుటకు శ్రీ కోర్టువారు ఆర్డరు చేసియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని కావలియువారు **తేది 02-5-2024 న పగలు 10.30 గంటలు** లగాయితు పై కోర్టులో జరుగు బహిరంగ వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. షెడ్యూలు ఆస్తి వివరములు శ్రీ కోర్టువారి సెంట్రల్ నాజరు వారి ఆఫీసు నందు మరియు డిక్రీ హోల్డర్ తరుపు వకీలు ఆఫీసు నందు దొరుకును.

వేలం కాబడు షెడ్యూలు స్థిరాస్తి వివరం:

శ్రీకాకుళం జిల్లా, రాజాం సబ్ రిజిష్ట్రారు, సంతకవిటి మండలంలో గల పోనుగుటివలస గ్రామం మరియు పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబర్లు 80/4, 80/14 ఉన్న మొత్తం 0.33 సెంట్లులో గల విస్తీర్ణంలో 0.03 సెంట్లు గల మెట్టు భూమి తూర్పు-పడమరలు - 24 అడుగులు, ఉత్తర దక్షిణలు - 55 అడుగులు అనగా 146.66 చదరపు గజములు గల ఆస్తికి హద్దులు: తూర్పు: పొట్నూరు అప్పారావు మరియు దూబ చిరంజీవుల మెట్టు భూమి, దక్షిణ : సిమెంటు రోడ్డు, పడమర: నెమ్మది అప్పలనాయుడు ఖాళీ స్థలం, ఉత్తర: నెమ్మది అప్పలనాయుడు ఖాళీ స్థలం.

Decree Holder Value: 6,00,000/-, Amin Value: 6,00,000/-
Warrant Amount : 52,61,969/-, EP Amount: 45,47,187/-

Place: Srikakulam,
Date: 15.04.2024.

BHYRI DAMODARA RAO
ADVOCATE FOR DECREE HOLDER,
SRIKAKULAM, CELL : 9440112790.

ధర్మాన హయాంలోనే మార్కెట్ అభివృద్ధి

మాట్లాడుతున్న ఎం.వి పద్మావతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసింది వైసిపి ప్రభుత్వమేనని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో ఉన్న వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో పర్యటించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు తమ హయాంలోనే మార్కెట్ అభివృద్ధి జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐడిఎస్‌ఎంటి స్కీమ్ నిధులతో మార్కెట్‌ను అభివృద్ధి చేశామన్నారు. అయితే ఆ సమయంలో నిధులు చాలకపోవడంతో ధర్మాన సహకారంతో నిధులు ప్రభుత్వం నుంచి తెప్పించుకుని మార్కెట్‌ను అభివృద్ధి చేశామని వివరించారు. టిడిపి హయాంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న నారాయణను మార్కెట్‌లో పర్యటింప జేసి అభివృద్ధి చేస్తామని చెప్పి కాలయాపన చేశారన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి ధర్మాన నేల దుకాణదారులు, కిరాణా వర్తకులతో మాట్లాడి వారికి అవసరమైన మేరకు సిసి రోడ్లు, దుకాణాలు నిర్మించి అందజేశామన్నారు. మార్కెట్ అభివృద్ధిలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు పాత్ర లేదన్నారు. జిల్లాలో అంబేద్కర్ యూనివర్శిటీ, రిమ్స్ ఆస్పత్రి, 80 ఫీట్ రోడ్డు, నాలుగు వంతెనలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ధర్మాన ప్రసాదరావుకే దక్కుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ చల్లా అలివేలు మంగ, మాజీ కౌన్సిలర్లు ఎంఎ రఫీ, పండరీనాథ్, ధర్మాన రఘునాథమూర్తి, సుంకరి కృష్ణ పాల్గొన్నారు.

వలస కూలీ మృతి

రామయ్య (ఫైల్)

ప్రజాశక్తి - టెక్కలి
కుటుంబ పోషణ నిమిత్తం పొట్ట చేత పట్టుకొని ఊరు కాని ఊరు వెళ్లి అక్కడ ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కూలి విషాదగాథ టెక్కల్లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కర్రీ రామయ్య తన భార్య తులసమ్మ, పెద్ద కుమారుడు లక్ష్మీ నారాయణతో కలిసి నెల్లూరు జిల్లా కొండాపల్లికి వెళ్లారు. వద్ద భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామయ్య మృతి చెందారు. మృతుడి రెండో కుమారుడు గణేష్ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి స్థానికంగా ఉన్నాడు. మరో కుమారుడు కిరణ్ పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడే వసతిగృహంలో ఉంటున్నాడు. మృతుడు రామయ్య 20 రోజుల క్రితం టెక్కలి వచ్చి సంబరాలను పూర్తిచేసుకుని వెళ్లాడు. ఇతని భార్య తులసమ్మ పది రోజుల క్రితం నెల్లూరు వెళ్లింది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో రామయ్య మృతి చెందిన విషయం స్థానికులను కలచివేసింది. మంగళవారం ఉదయానికి రామయ్య మృతదేహం టెక్కలి చేరుకోనుంది.

ముంబయిలో జిల్లా వాసి మృతి

ఇచ్ఛాపురం: మండలంలోని కేదారిపురానికి చెందిన నీలపు గణేష్ (27) ముంబయిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్తున్నట్లు గత నెల 16న ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. బాగా డబ్బు సంపాదించుకుని తిరిగి ఇండియాకు వస్తానని అన్నారు. ఇంతలో ఆదివారం మీ కుమారుడు ముంబాయిలో మృతి చెందారని రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ వార్త వినగానే కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గుర య్యారు. దుబాయ్ వెళ్లకుండా ఇప్పటి వరకు ఎక్కడ పనిశారు, ఎందువల్ల రైల్వే పోలీసులు మృతి చెందిన సమాచారం ఇచ్చారు అన్న వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు ముంబాయి వెళ్లారు. మృతుడికి తల్లి తరుణమ్మ, సోదరుడు దుర్యోధన, సోదరి లావణ్య ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గడ్డివాములు దగ్ధం

నౌపడ : సంతబొమ్మాళి మండలం మర్రిపాడు పంచాయతీ పెద్దమర్రిపాడులో సోమవారం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గడ్డివాములు పైనుంచి వెళ్తున్న విద్యుత్తు లైన్‌లో ఒకదానికొకటి రాసుకొని షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు అంటుకుని దగ్ధమైనట్లు స్థానికులు చెప్తున్నారు. గ్రామానికి చెందిన నందికి లక్ష్మీనారాయణ, రాంపాత్రుని అప్పన్న, రాంపాత్రుని సాయి, నందికి రాజారావులకు చెందిన నాలుగు గడ్డివాములు ప్రమాదంలో దగ్ధమయ్యాయి. గ్రామస్తుల సమాచారంతో టెక్కలి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పశువుల కొరకు దాచుకున్న గడ్డి వాములు దగ్ధం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దగ్ధమవుతున్న గడ్డివాములు

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

రణస్థలం : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం
ప్రతిఒక్కరు అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండటం వలన తమ చుట్టు పక్కల వారిని చైతన్యవంతులుగా చేసి ప్రమాదాలను నివారించవచ్చునని అగ్నిమాపక శాఖాధికారి పైలా అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రామాంజనేయ థియేటర్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ వినియోగించే పరికరాలను ప్రదర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఏవిధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. ఏదైనా ప్రమాదం లేదా విపత్తు సంభవించిన వెంటనే 08941 260111, 9553918425 నెంబర్‌కు సమాచారం అందివ్వాలన్నారు.

ఆమదాలవలస : అగ్ని ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి అప్పారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు వాటి నివారణపై ప్రజలకు వివరించి పోస్టర్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద పలు రకాల విన్యాసాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక అధికారి బుచ్చోడు ఆధ్వర్యాన ప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనంతో విన్యాసాలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

వైసిపిలో పలువురు చేరిక

శ్రీకాకుళం రూరల్ : పార్టీలో చేరిన వారితో మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్
మండలంలోని సింగుపురం పంచాయతీ, మునసబు పేటకు చెందిన యువకులు ఎంపిటిసి బగ్గ అప్పారావు, రంది రాజారావు ఆధ్వర్యంలో పెదపాడు వద్ద ఉన్న ధర్మాన క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైసిపిలో చేరారు. అదేవిధంగా గూడెం గ్రామానికి చెందిన 200 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వారిని మంత్రి ధర్మాన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆమదాలవలస: బూర్జ మండలం వావాం పంచాయతీ పరిధిలోని ఉప్పేటకు చెందిన 30 కుటుంబాలు వైసిపిలో చేరాయి. సోమవారం పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాల యం వద్ద వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వంకా లక్ష్మీనారాయణ, పోతిన శ్రీను, కర్రి మల్లేష్, పట్టణ వెంకటరావు, బొమ్మ అప్పన్న, రమణ, బెవర నందికేశ్వరరావు, లక్ష్మీనారాయణ, వెంకటావు గణేష్, సూర్యనారాయణతో పాటు మరో 20 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. కార్యక్రమంలో బూర్జ ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వియ్యపు కృష్ణ, తొత్తడి సురేష్, లావేటి శ్రీను, సర్పంచ్ గొలివి మంజుల, వావిలిపల్లి గోవిందరావు, మజ్జి నరసింగరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిరంజీవి నాగ్

ఒక్క అవకాశం ఇవ్వాలి

లావేరు: ఒక్క అవకాశం ఇచ్చి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఎచ్చెర్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని భీమునిపాళెం, తాళ్లవలస, సుభద్రపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అబోతుల వెంకటనాయుడు, దొండపాటి అప్పారావు, నడిమిటి సత్యనారాయణ, మీసాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

నూకయ్యకు చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం
జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహించిన ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఆరిక నూకయ్యకు సహచర హోంగార్డులు ఒక్కరోజు వేతనం విరాళంగా సేకరించిన రూ.4.21 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ నగదును భవిష్యత్, కుటుంబ అవసరాల మేరకు ఉపయోగించుకోవాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, హోంగార్డుల ఇన్‌ఛార్జి హెడ్ కానిస్టేబుల్ రాజు ఉన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఓటుహక్కుపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస
రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం బొబ్బిలి పేట, దూసి, సైలాడ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం మన దృఢమైన ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఓటే వజ్రాయుధమన్నారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, గ్రామ సంఘం ప్రతినిధులు మెట్ట స్వర్ణలత, గురుగుబెల్లి ఈశ్వరమ్మ, రాజు, వి.ఎ.ఎ శృతి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహశీల్దార్ కె.వేణుగోపాల్ సూచించారు. ఓటుహక్కు అవగాహనలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శిరీష, మెప్మా సిబ్బంది ఎ.వి శ్రీనివాస్, అమ్మినాయుడు, నాగమణి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా గుప్తా

శ్రీకాకుళం అర్బన్: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షునిగా మండవిల్లి స్వామి శ్రీనివాస గుప్తా ఎన్నికయ్యారు. సోమవారం ఆవోపా కళ్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ఎన్నిక కావడం రెండవసారి. ఆర్యవైశ్య సామాజిక అభివృద్ధి కోసం అందరిని సమన్వయం చేసుకుంటూ సేవా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడంలో ఎంతగానో కృషి చేశారని, సంఘం అభివృద్ధికి మరింత కృషి చేయాలని సభ్యులు సూచించారు. సమావేశంలో సభ్యులు మండవిల్లి రవి, పేర్ల సురేష్, నరేష్ పాల్గొన్నారు.

పవన్ పేరు వింటేనే జగన్‌కు జ్వరం

ఆమదాలవలస: జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పేరు వింటేనే సిఎం జగన్‌రెడ్డికి జ్వరం పట్టుకుంటుందని జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే ధ్యేయంగా టిడిపి, బిజెపి, జనసేన కూటమిని తయారు చేసిన పవన్ కళ్యాణ్‌పై గుంటూరు జిల్లాలో రాయితో దాడి జరిగిన సంఘటనపై ఆయన తీవ్రంగా ఖండించారు. 2019 ఎన్నికలలో కోడి కత్తి డ్రామాతో అధికారం చేపట్టిన జగన్ నేడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి గులకరాయి డ్రామాకు తెర లేపారన్నారు. సమావేశంలో కోడిపాత్రుని నారాయణరావు, పైడి ప్రసాద్ పాల్గొన్నారు.

అందంగా తీర్చిదిద్దిన తరగతి గది

మనసు పెడితే ఇలా...

- సొంత, దాతల నిధులతో అభివృద్ధి
- ఇదీ చాపర ప్రాథమిక పాఠశాల-1

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అభివృద్ధి అంటే గుర్తుకొచ్చేది ఆ పాఠశాల. అదే చాపర ప్రాథమిక పాఠశాల-1. నాణ్యమైన విద్యను అందించడమే కాదు పాఠశాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి నాందని నమ్మారో ఏమో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా పనిచేశారు. ఏదో ప్రభుత్వం ఇస్తున్న జీతం తీసుకుని నాలుగు పాఠాలు బోధించి రోజు ముగించాలనే ఆలోచన ఆయనకు లేదు. పాఠశాలను జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచన ఆయనకు కలిగింది. తన కల సాకారం చేసుకునే దిశగా పనిచేశారు... సాధించారు... అది ప్రభుత్వ పాఠశాల అక్కడ చదివేది కేవలం నిరుపేద, మధ్యతరగతికి చెందిన కుటుంబాల విద్యార్థులు మాత్రమే. అయినా ఆ పాఠశాలలో అడుగు పెడితే ఏదో తెలియని అనుభూతి ఒక కార్పొరేట్ పాఠశాలలో చదువుకునే విధంగా ఉంటుంది వాతావరణం.

పచ్చదనం, పరిశుభ్రత పాఠశాల సొంతం

పాఠశాలలో ఎటుచూసినా పచ్చని మొక్కలు మంచి వాతావరణం ఉండే ఆ పాఠశాలలో పరిశుభ్రమైన అందమైన మరుగుదొడ్లు పాఠశాలలో ఎల్లప్పుడు స్వచ్ఛ భారత్. అంతేకాకుండా విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, దేశ నాయకుల చిత్రాలు, అలాగే దేశం, రాష్ట్రం, ప్రపంచం, జిల్లా, మండలాల మ్యాపింగ్ చిత్రాలను ఏర్పాటు చేశారు. అదే కాకుండా విద్యార్థులకు చదువుకోవడానికి వీలుగా అందమైన ఫర్నిచర్ బెంచీలు, కుర్చీలు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, దాతల నుంచి స్వీకరించి అందించారు.

తమ వంతుగా రూ.3 లక్షలు ఖర్చు

పాఠశాలను బాగు చేయాలనే తపనతో, దృక్పథంతో ఉన్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి తమవంతుగా రూ.3 లక్షలు వెచ్చించి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శవంతమైన పాఠశాలగా తయారు చేశారు. తమకు తెలిసిన స్నేహితుల ద్వారా కొంత సొమ్మును సేకరించి పాఠశాలకు అవసరమైన సామగ్రి, క్రీడా వస్తువులు క్రీడాస్థలం, మరుగుదొడ్ల నిర్మాణం లాంటి ఏర్పాట్లు చేశారు. నేడు, రేపు ఆయన పేరు చెబితే సంతోషంగా పిల్లలు బడికి వెళ్లి చదువుకునే పరిస్థితి. ఆ పాఠశాలను చూడగానే మారాం చేయకుండా చదువుకోవాలని తపన ప్రతి విద్యార్థికీ కలిగేలా చేశారాయన. ఆయన శ్రద్ధపై ఆకర్షితులై చాలామంది పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకొచ్చారు. పాఠశాల సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థులనూ ప్రతిభావంతులుగా తయారు చేశారు ఆయన. నవోదయలోనూ.. ఫలితాలలో అతని విధ్యార్థులే బెస్ట్. ఇటువంటి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, సద్గుణాలు కలిగే అవకాశాలు ఎన్నో ఉన్నాయి ఇలాంటి ఉపాధ్యాయులు సమాజానికే ఆదర్శమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలనే...

ఉపాధ్యాయ రంగంలో అడుగుపెట్టినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ధ్యేయంతో పని చేయాలనే తపన నాలో ఉంది. అందుకే తన వంతు కృషిగా కొంత సొమ్ము వెచ్చించి, దాతల ద్వారా కొంత సేకరించి పాఠశాల అభివృద్ధికి ఉపయోగించా. పాఠశాలలో ప్రస్తుతం 134 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్య అనేది భవిష్యత్‌కు ద్వారం లాంటిది. అదే నాణ్యమైన విద్య అందించకపోతే విద్యార్థుల్లో ప్రతిభ పాటవాలు తగ్గే అవకాశముంది.

- గోరు కుమారస్వామి, ప్రధానోపాధ్యాయులు, చాపర-1

ఉపాధ్యాయులకు ఆదర్శం

మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి ఇటువంటి పాఠశాలలే నిదర్శనం. నాణ్యమైన విద్యను అందించే గతంలో ప్రతి ఉపాధ్యాయుడు ఆలోచించగలిగితే ఇటువంటి పాఠశాలలు ఎన్నో తయారు చేయగలం.

- ఎస్.దేవేంద్రరావు విద్యాశాఖ అధికారి

బోధన బాగుంది

మా పాపకి ప్రవస్తి నవోదయకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తరువాతే చక్కగా చదువుతుంది. ఈ పాఠశాలలో సదుపాయాలు, బోధన చాలా బాగున్నాయి. ఒక్క రోజూ స్కూల్‌కి వెళ్లనని మారాం చేయలేదు.

- కె.రూప, గ్రామస్తురాలు

నవోదయలో మెరుగైన ఫలితాలు

పాఠశాల సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థులను కూడా ప్రతిభావంతులుగా తయారు చేశారు ఆయన. దానికి ఫలితంగా విద్యార్థులు తగిన ప్రతిభను కనబరిచారు. గతేడాది నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా, ఈ ఏడాది నవోదయకు ముగ్గురు ఎంపికయ్యారు. 2018 నుచి ఇప్పటి వరకు 13 మంది నవోదయకు ఎంపికయ్యారు. ఇటువంటి పాఠశాలలు ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, సద్గుణాలు కలిగే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఉపాధ్యాయులు సమాజానికే ఆదర్శమని పలువురు అంటున్నారు.

ఆడుకుంటున్న చిన్నారులు

ప్రహరీ గోడపై వేసిన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు

టెక్కలిలో త్రిముఖ పోటీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర రాజకీయాల్లో టెక్కలి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక ఉంది. టెక్కలి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు దృశ్య నిరంతరం రాష్ట్ర రాజకీయలు టెక్కలి వైపు చూసింటాయి. అటువంటి తరుణంలో టెక్కలి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకుంది. సార్వత్రిక ఎన్నికలు సుమార నెల రోజులు ఉండగా... అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు సారథ్యం వహిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు, అధికార పార్టీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మధ్య పోటీ ఉంటుందని నియోజకవర్గం ప్రజలు భావించారు. అనూహ్యాంగా ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రెండున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు.

ఈ తరుణంలో నియోజకవర్గ రాజకీ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కియి. టెక్కలిలో వైసిపి, టిడిపి మధ్యే పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉంటుందని భావిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ కృపారాణి అభ్యర్థిగా ప్రకటించడంతో రసవత్తరంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు నియోజకవర్గంలో చాపకింద నీరులా తన వంతుగా ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. కళింగ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి కావడంతో ఇప్పటికే నియోజకవర్గంలో ముఖ్యమైన నాయకులను కలిసి ఎలాగైనా టెక్కలి ఇండియా వేదిక గెలుపునకు కృషి చేస్తున్నారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి అనుభవంతో నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో నాయకులతో సత్సంబంధాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే దీనిని ఓటు రూపంలో మలుసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికలకు టెక్కలి నియోజకవర్గంలో అందరి మదిలో ఉత్కంఠ నెలకొనే పరిస్థితులు ఉన్నాయి. నియోజకవర్గంలో 2.30 లక్షలు ఓట్లు ఉండగా, అందులో కళింగ సామాజిక తరగతికి చెందిన ఓట్లు సుమారు 70 వేలు పైగా ఉన్నాయి. దీంతో మూడు పార్టీలు కళింగ సామాజిక తరగతికి చెందిన ఓట్లు పైనే దృష్టి పెట్టాయి. ఏదేమైనానప్పటికీ టెక్కలి గెలుపు ఎవ్వరికీ అంతా సునాయాసం కాదని రాజకీయ అనుభవజ్ఞులు భావిస్తున్నాయి.

అచ్చెన్నాయుడు | దువ్వాడ శ్రీనివాస్ | కిల్లి కృపారాణి

రెడ్డి శాంతి విస్తృత ప్రచారం

మట్టి మోస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వ పథకం అందించిన ప్రభుత్వం వైసిపి అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని సుందరాడ, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి, చాపర పంచాయతీల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కొద్దిసేపు గడిపారు. మట్టి తట్టను నెత్తిపై పెట్టుకుని వినూత్నంగా ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ మన పాలన మనమే చేసుకునేలా మనకు ఒక అవకాశం కల్పించిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు.

ఇంత గొప్ప ప్రభుత్వం మళీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి నాకు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఊర్లన హంసమ్మ ఋషి, జెడ్‌పిటిసి ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయకుమార్, వైసిపి కన్వీనర్ పల్లి యోగి, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పాడి అప్పారావు, కన్నబాబు, గణేష్ ప్రధాన్, పెద్దింటి చంద్రరావు, బోసి రామారావు, ఎస్.భాస్కరరావు, మాడుగుల రామారావు, లింగాల సంజీవరావు, కరణం శశిభూషణరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. సోమవారం మండలంలోని కొర్లకోటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగానే ఉపాధిహామీ కూలీని రూ.400 పెంచనున్నదన్నారు. ప్రజలందరూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న అన్నాజీరావు

గ్రామాల అభివృద్ధి కోసం గెలిపించాలి

ప్రచారం చేస్తున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రాష్ట్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం రావాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జి.శంకర్ అన్నారు. మండలం సింగుపురం పంచాయతీ బగ్గువానిపేటలో సోమవారం మాజీ ఎంపిపి గొండు జగపతి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వైసిపి పాలనతో ప్రజలు కష్టాలు పాలయ్యారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీ ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గంలో ప్రతి పనికి కమిషన్లు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్న నాయకులను ఓటు అనే ఆయుధంతో ప్రజలు తరిమికొట్టాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మండలం బాణాంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన ఐదేళ్లగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి చేటుచేసుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దింటి విష్ణు, రమణ, సూర కిరణ్, పిన్నింటి అప్పలనాయుడు, ఢిల్లీశ్వర రావు, పాపారావు, కోరుకొండ సాయికుమార్, పోతురాజు సూర్యారావు, చింతాడ శివకుమార్, ప్రసాద్, ధర్మ పాల్గొన్నారు.

బాణాంలో ప్రచారం చేస్తున్న గాంధీ

కంచుకోట బద్దలు కొడతారా?

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపికి కంచుకోట. ఇది కేవలం టిడిపి నాయకుల అభిప్రాయం మాత్రమే కాదు వైసిపి నేతల అంతర్మథనం కూడా. దానికి తగ్గట్టే ఐదేళ్లుగా నియోజకవర్గంలో జరిగిన ప్రతి వైసిపి సమావేశంలోనూ ఈసారి కంచుకోట బద్దలుకొట్టి, ఇచ్ఛాపురం నియోజకవర్గం ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలనే ముఖ్య నాయకులు ఊదరగొట్టారు. అయితే నిజంగానే ఈసారి కంచుకోట బద్దలవుతుందా? ఇచ్ఛాపురంలో టిడిపి గండాన్ని వైసిపి దాటుతుందా? ఒకసారి వాస్తవాలు పరిశీలిస్తే... 1983 నుంచి 2019 ఎన్నికల వరకు ఒక్క 2004 ఎన్నికలు తప్పించి మిగతా అన్ని ఎన్నికల్లో టిడిపి జయకేతనం ఎగురవేసింది. గతంలో స్థానికేతరుడైన ఎం.వి.కృష్ణారావు తనదైన శైలిలో ఇచ్ఛాపురంలో టిడిపిని నడిపిస్తే, ప్రస్తుతం పక్కా లోకల్ బెందాళం అశోక్ అనుక్షణం అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు. ఇక 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టి ఇచ్ఛాపురం నియోజకవర్గంపైనే పడిందంటే నియోజకవర్గంలో టిడిపి ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో అప్పటి నుంచే 2024 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అనేక పదవులు, మరిన్ని నిధులు నియోజకవర్గానికి కేటాయించారు. అయితే అవన్నీ క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రస్తుతం వైసిపి అభ్యర్థి విజయానికి తోడ్పడతాయా అంటే ప్రశ్నార్థకమే సమాధానమవుతోంది. ఎందుకంటే ఉండేది ఒక్కపిల్ల ఊరంతా మేనరికమే అన్న సామెతలా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి పరిస్థితి తయారైంది. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలు అటు ఉన్నతాధికారులు, ఇటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తూ... నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండేవారు. అలా గడుస్తున్న కొద్దీ ఈసారి టిక్కెట్ తనదేనని బలంగా నమ్మడమే కాకుండా తన అనుచర గణాన్ని ఎన్నికలకూ సమాయత్తం చేసుకున్నారు. అధిష్టానానికి కూడా ఆయనపై సదాభిప్రాయమే ఉండేది. కానీ, అనుకోని ఓ సంఘటన ఆయన రాజకీయ జీవితాన్నే ప్రశ్నార్థకం చేసింది. ఆ తరువాత మంత్రి ధర్మాన ప్రసాదరావు అండతో మరో ఆచార్యులు ప్రయత్నించినా... అదీ విఫల ప్రయోగంగా మిగిలింది. ఆ తరువాత మరో అరడజను మంది ఆశావాహులు తమతమ ప్రయత్నాలు చేశారు. ఈలోగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఏర్పడిన తరువాత జిల్లాలో టిడిపి ప్రకటించిన మొదటి సీటు ఇచ్ఛాపురం నియోజకవర్గం బెందాళ అశోక్‌దే. అదే సమయంలో తమ అభ్యర్థి ప్రకటనపై వైసిపి అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. రోజుకో పేరుతో సోషల్ మీడియాలో ఎవరికి వారు తామే అభ్యర్థులమంటూ పేజీలు నింపేసుకుండే వారు. అయినా ఈ అరడజనుకు పైగా ఆశావాహులు మాత్రం తమతమ ప్రయత్నాలు చివరి వరకూ చేశారు. ఒకానొక దశలో పిలక రాజ్యలక్ష్మికి టిక్కెట్ ఖరారైనట్లు వైసిపి ముఖ్య నాయకులే బహిర్గతమయ్యారు.

పిలక రాజ్యలక్ష్మి కూడా నియోజకవర్గానికి చెందిన ప్రముఖులను కలిసి తనని ఆదరించాలని అభ్యర్థించడం కూడా జరిగిపోయింది. కానీ, అనూహ్యంగా చివరి నిమిషంలో ఇచ్ఛాపురం వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత జెడ్‌పి చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సతీమణి పిరియా విజయ పేరు తెరపైకి వచ్చింది. దీంతో సహజంగానే అసంతృప్తులు మొహం చాటేయడం, కొన్ని సందర్భాల్లో బహిరంగంగానే విజయ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం జరిగింది. చివరకు అటు అధిష్టానం ఆగ్రహం, ఇటు సాయిరాజ్ మంత్రాంగం ఫలించి నియోజకవర్గ ప్రముఖ నాయకులు ఏకమై ఇచ్ఛాపురంలో సమావేశం ఏర్పాటు చేసి మేమంతా ఒక్కటే అంటూ ఫోజులిచ్చారు. ఆ తరువాత కొన్ని రోజులు కలిసి తిరిగారు. ఇంతలోనే ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త తనని అవమానపరిచారని వైస్ చైర్‌పర్సన్ ఏకంగా పోలీసులకే ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అంతటితో ఆగకుండా చైర్‌పర్సన్ భర్త తననే కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థిని కూడా కొన్ని సందర్భాల్లో అడ్డుకున్నారని, తన అనుమతి లేకుండా తన పేటకు ఎలా వచ్చావంటూ అనరాన్ని పదజాలం వాడారని మీడియా ముందు ఆమె వాపోయారు. ఇక మంత్రి ధర్మాన ప్రసాదరావు కూడా ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం టిక్కెట్ ఈసారి రెడ్డిలకు ఇవ్వాలని అనుకున్నామని, కానీ, కొన్ని కారణాల వల్ల ఇవ్వలేకపోయామని పదేపదే చెప్పడం పార్టీలో లొసుగులు బహిర్గతం చేశాయి. ఇవన్నీ నియోజకవర్గ ప్రజానీకానికి వైసిపిలోని ఇంటిపోరును కళ్లకు కట్టినట్టు చూపించడమే కాకుండా నియోజకవర్గ సమన్వయకర్త కుటుంబంపై పార్టీలో ఉన్న అసంతృప్తిని తేటతెల్లం చేస్తున్నాయి. అయితే వైసిపి అభ్యర్థి పిరియా విజయ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా తన పనితాను చేసుకుంటూ పోతున్నారు. ముఖ్యంగా మహిళల ఓట్లపై కన్నేసిన ఆమె ఓవైపు గ్రామాల్లో ప్రచారం చేస్తూనే ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలను తరచూ కలుస్తూ వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే అశోక్ మొదటి నుంచి ప్రజా నాయకుడుగా పేరు సంపాదించుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్ధరాత్రి తలుపుతట్టినా అండగా ఉంటారని పార్టీలకు అతీతంగా నాయకులు చెప్పుకోవడం విశేషం. అంతేకాకుండా నియోజకవర్గంలో టిడిపి శ్రేణులను తన సొంత కుటుంబ సభ్యుల్లా వ్యవహరిస్తూ వారి మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇవన్నీ తోడుగా బెందాళం అశోక్ ఒకవైపు, ఆయన సతీమణి నీలోత్పల మరోవైపు, టిడిపి, జనసేన శ్రేణులు నలు వైపుల నుంచి నియోజకవర్గాన్ని చుట్టుముడుతున్నారు. అమ్మ, బాబాయ్, పిన్ని, అన్నా అంటూ వరుసలు కలుపుతూ ప్రతి గడపా తిరుగుతున్నారు. అలాగే టిడిపి జనసైనికులు పూర్తిస్థాయిలో తమ సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ఇక పోలింగుకు సమయం సుమారు నెల రోజులు ఉన్న ఈ పరిస్థితుల్లో వైసిపి శ్రేణులు టిడిపి కంచుకోటని బద్దలు కొడతాయా? ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఇచ్ఛాపురం నియోజకవర్గం బహుమతిగా అందిస్తారా? అంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

జంపింగ్ జపాంగ్!

- పార్టీలు మార్చిన ఘ(మ)న నేతలు
- రాజకీయ సమీకరణాలతో పక్కచూపులు
- కీలక పదవులతో రాణించిన నాయకులు

ఎంతో మంచి నాయకులను జాతికి అందించింది మన జిల్లా, తొలినాళ్లలో లుకలాపు లక్ష్మణదాసు నుంచి టిడిపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షుడు కళా వెంకటరావు వరకూ కీలక పదవులు అలంకరించిన వారు ఎంతోమంది ఉన్నారు. కానీ ఎప్పటికప్పుడు మారిన రాజకీయ సమీకరణలతో వేర్వేరు పార్టీల గొడుగున చేరిన వారున్నారు. అవకాశాల కోసం పక్క పార్టీలో చేరి... తిరిగి మాతృసంస్థలకు చేరిన వారున్నారు. పార్టీలు ఎన్ని మారినా... కీలక పదవులతో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన వారూ ఉన్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కీర్తిశేషులు గౌతు లచ్చన్న 1952, 1955 ఎన్నికల్లో కృషీకర్ లోక్పార్టీ తరపున సోంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1962, 1967 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1972లో పరాజయం పాలవ్వడంతో జనతా పార్టీలో చేరారు. 1978లో ఆ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. 1983లో లోకళ్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు.

కొత్తూరు నుంచి కీర్తిశేషులు నిమ్మక గోపాలరావు 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 1978లో కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1983లో టిడిపిలో చేరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పాతపట్నం నియోజకవర్గం నుంచి తొలిసారిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన కలమట మోహనరావు 1983లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. టిడిపి ఆవిర్భావం తరువాత ఆ పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. 2008లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అటు తరువాత వైసిపిలో చేరారు. 2014లో ఆయన కుమారుడు వెంకటరమణ వైసిపి ఎమ్మెలేగా గెలుపొంది టిడిపిలో చేరారు.

పాతపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన దివంగత గొర్లె హరిబాబునాయుడు టిడిపి సహాయ సహకారాలతో ఎమ్మెల్సీగా గెలుపొందారు. తదుపరి ఈయన ప్రజారాజ్యంలో చేరారు. చనిపోయిన కొద్ది రోజుల ముందు టిడిపిలో చేరారు. కీలక పదవులు దక్కించుకున్న ధర్మాన ప్రసాదరావు తొలుత కాంగ్రెస్ పార్టీలో గెలుపొంది... 2014 ఎన్నికల ముందు వైసిపిలో చేరిపోయారు. అతని సోదరుడు కృష్ణదాస్ సైతం కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై... వైసిపిలో చేరారు.

ఎన్‌టిఆర్ వెంట అప్పయ్యదొర

టిడిపి ఆవిర్భావం తరువాత పార్టీలో చేరిన హనుమంతు అప్పయ్యదొర ఎంపీగా గెలుపొందారు. 1994లో ఎన్‌టిఆర్ టెక్కలి ఎమ్మెల్యేగా రాజీనామా చేయగా, ఉప ఎన్నికల్లో అప్పయ్యదొర బరిలో దిగి విజేతగా నిలిచారు. అక్కడకు కొద్దిరోజుల తరువాత తెలుగుదేశం పార్టీలో చీలిక వచ్చింది. ఆ సమయంలో ఎన్‌టిఆర్ వెంటే ఉండిపోయారు. ఎన్‌టిఆర్ మృతి తరువాత లక్ష్మీపార్వతి ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ టిడిపిలో కొనసాగారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కళా, తమ్మినేని ఒకేసారి..

టిడిపితో రాజకీయ అరంగేట్రం చేసి మంత్రులుగా కూడా వ్యవహరించిన కళా వెంకటరావు, తమ్మినేని సీతారాం పార్టీ మారారు. ప్రజారాజ్యం ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చవిచూశారు. తరువాత ఇద్దరూ మళ్లీ టిడిపిలో చేరారు. అక్కడకు కొద్ది రోజుల తరువాత తమ్మినేని సీతారాం వైసిపిలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం శాసనసభ స్పీకర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కళా విజయనగరం జిల్లా చీపురుపల్లి, ఆమదాలవలస ఎన్నికల బరిలో దిగారు.

కాంగ్రెస్ అసోసియేట్ సభ్యులుగా...

కీర్తిశేషులు ఎర్రన్నాయుడు, గౌతు శ్యామసుందర శివాజీలకు 1989 ఎన్నికల్లో టిడిపి అధిష్టానం టిక్కెట్ ఇవ్వలేదు. స్వతంత్ర అభ్యర్థులుగా హరిశ్చంద్రపురం, సోంపేట నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి అసోసియేట్ సభ్యులు 5గా వ్యవహరించారు. తరువాత ఎన్నికల్లో తిరిగి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పోలాకి : టిడిపి కండువా వేస్తున్న రమణమూర్తి

పాతపట్నం/హిరమండలం : హిరమండలం మండలం ఎంపిపి ప్రతినిధి తూలుగు తిరుపతిరావు మస్టార్ ఆధ్వర్యాన ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు సమక్షంలో వైసిపి వీడి టిడిపిలో వైస్ ఎంపిపి సవర వైకుంఠరావు, పెద్దగూడ ఎంపిటిసి సవర శ్రీదేవి, హిరమండలం-2 ఎంపిటిసి తట్ల శంకర్, అవలింగి ఎంపిటిసి కరణం ప్రియాంక, హిరమండలం మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు సుంకర కోటేశ్వరరావు, అక్కరాపల్లి సర్పంచ్ మల్లిపురం రామారావు, పిండ్రువాడ సర్పంచ్ మండ చిన్నమ్మి, మర్రిగూడ సర్పంచ్ ఉయ్యక సురేష్, రుగడ సర్పంచ్ కొర్రాయి పెంటయ్య, కల్లట సర్పంచ్ లావేటి లీలావతి, లోకొండ సర్పంచ్ వబ్బంగి లక్ష్మి, గుర్రాలమెట్ట సర్పంచ్ కూరంగి మల్లేష్ టిడిపిలో చేరారు.

పోలాకి: వైసిపిని వీడి టిడిపిలోకి పలువురు చేరుకున్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో వీరికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి సోమవారం పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. సారవకోట ఎంపిటిసి మాజీ సభ్యులు వాన కామేశ్వరరావు, బోర గౌరినాయుడు, ముత్తరాల జ్ఞానికుమార్, దండు చలపతిరావు, దండు రాజుతో పాటు 20 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, కోన వెంకటేష్, చీడి వెంకటరమణ, నక్క షణ్ముణ్ పాల్గొన్నారు.

పాతపట్నం : టిడిపి కండువా వేస్తున్న గోవిందరావు

టెక్కలి : టెక్కలి మండల వైసిపి మాజీ అధ్యక్షులు, అయోధ్యపురం సర్పంచ్ శోభారాణి, సర్పంచ్ ప్రతినిధి బగాది హరి టిడిపిలో చేరారు. పలాసలోని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ నెల 19న అయోధ్యాపురంలో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి ఎందుకు వైసిపిని వీడనున్నట్లు చెబుతానని అన్నారు.

వైసిపి విస్తృత ప్రచారం

నరసన్నపేట : ప్రచారం చేస్తున్న శ్రావణి, గ్రీష్మ

ఇచ్ఛాపురం : ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి

నందిగాం : మండలంలోని నిందిగాం పంచాయతీ పెంటఊరులో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు మద్దతుగా టెక్కలి నియోజకవర్గం పరిశీలకులు వెంకటరెడ్డి ఆధ్వర్యాన నాయకులు ర్యాలీ నిర్వహించారు.

కోటబొమ్మాళి: మండలంలోని దుర్గంపేట, ఊడికలపాడు, సీతన్నపేట గ్రామాల్లో వైసిపి ఎంపీ అభ్యర్థి తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు మద్దతుగా కార్యకర్తలు మండల విప్ బొడ్డు అప్పన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బొడ్డు వెంకటరమణ, ముద్ద రాము, కొర్రాయి తులసీరామ్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమని మున్సిపల్ చైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 17 వార్డు లాలపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ టెంకలక్ష్మి, వైస్ చైర్మన్ దివ్యభారతి, కార్పొరేషన్ చైర్మన్లు డి.లోకేశ్వరరెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రకాశపట్నాయక్, జెసిఎస్ కన్వీనర్స్ సాలిన ఢిల్లీ, పల్లెంటి మధుమూర్తి, పొన్న పువ్వుల తేజ, కిరణ్ బెహరా, మైనార్టీ సెల్ అన్వేష్, సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, కేశవపట్నాయ్, హరినారాయణ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీ, దేవరవీధి, కుమ్మరవీధిలో ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతికి మద్దతుగా ఆమె తనయుడు ఓంశ్రీకృష్ణ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, కలమట రమేష్, జి.ఆనందరావు, లక్ష్మీనారాయణ, బి.శ్రీను, నాగేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణదాస్ కోడళ్లు...

నరసన్నపేట : ఎమ్మెల్యే కృష్ణదాస్ కోడళ్లు కదిలారు... అన్ని వయసుల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ.. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మామయ్య కృష్ణదాస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. రసన్నపేట మేజర్ పంచాయతీ జగన్నాథపురం వీధుల్లో సోమవారం ఉదయం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మహిళా లోకాన్ని మెప్పిస్తున్నారు. నరసన్నపేట వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌కు తోడుగా భార్య పద్మప్రియ, కుమారులు రామలింగం నాయుడు, డాక్టర్ కృష్ణచైతన్యలు ఎన్నికల ప్రచారాన్ని రంజు పుట్టిస్తున్నారు. సోమవారం కృష్ణదాస్ కోడళ్లు శావణి, గ్రీష్మలు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్త, పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, సర్పంచ్ బూరెల శంకర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : ఉపాధి కూలీలతో రామ్ మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ప్రజలను కోరారు. గార మండలం బూరవిల్లి, కొర్నిలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావుకు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీగా పోటీ చేస్తా

మాట్లాడుతున్న యోగి

శ్రీకాకుళం అర్బన్: ఆదివాసి హక్కుల సాధన కోసం శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి వెల్లడించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసి హక్కుల సాధనే లక్ష్యంగా గత పదిహేనేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామని, జిల్లాలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై పలుమార్లు రాజకీయ పార్టీలకు మొర పెట్టుకున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. 1/70చట్టం అమలు పట్ల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు.సమావేశంలో గణేష్, సవర శోభన్, నానుపురం చిన్నారావు, లచ్చుమయ్య, నాగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మెరిసిన వలస కూలీ బిడ్డ

సిఇసిలో రాష్ట్రస్థాయిలో నీలవేణికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కవిటి

నీలవేణి

చదువుకు పేదరికం అడ్డు కాదని ఓ మత్స్యకార కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థిని నిరూపించింది. ఆంధ్రా సరిహద్దు గ్రామమైన సొన్నాపూర్‌కు చెందిన బడే నీలవేణి ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిఇసి గ్రూపులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి సత్తా చాటింది. నీలవేణి తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం తమిళనాడు రాష్ట్రంలో చెన్నైకి వలస వెళ్లారు. దీంతో నీలవేణి ఇచ్ఛాపురం మండలం డొంకూరులోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ పదో తరగతి వరకు చదువుకుంది. ఇంట్లో పరిస్థితుల నేపథ్యంలో అక్కడితోనే చదువు ఆపేయాలని సన్నిహితులు చెప్పినా... తన ఇంట పేదరికాన్ని పారదోలాలంటే దానికి చదువే సరైన మార్గమని నిర్ణయించుకుంది నీలవేణి. పై చదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో కవిటి మండలం కొత్తపాలెంలోని కెజిబివిలో ఇంటర్మీడియట్ సిఇసి గ్రూపులో చేరింది. కళాశాలలో చేరినప్పట్నుంచే నీలవేణికి చదువుపై ఉన్న ఆసక్తిని గమనించిన ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, కళాశాల సిబ్బంది ఆమెపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదువులో తీర్చిదిద్దారు. నీలవేణి కూడా పాఠశాల సిబ్బంది తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతిక్షణం తన కుటుంబ నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ శ్రమించింది. దాని ఫలితంగా ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిఇసి గ్రూపులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి చదువుకి పేదరికం అడ్డుకాదని నిరూపించింది. ఈ సందర్భంగా నేలవేణి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల నుంచి వచ్చానని, ఎప్పటికైనా బ్యాంకు కొలువు సాధించడమే లక్ష్యంగా చదువుతున్నానని తెలిపింది. అంతేకాకుండా తనలో ఉన్న లోపాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ తన ఉన్నతికి కృషి చేసిన కెజిబివి ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

తమ్మినేనికి బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడానికి బొడ్డేపల్లి రాజగోపాలరావు స్థాపించిన చక్కెర కర్మాగారాన్ని మూసి వేయించిన తమ్మినేని సీతారాంకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సనపల అన్నాజీరావు ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నాజీరావు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆశయ సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అవలంభిస్తున్న అరాచక పాలనపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, సిపిఎం మండల నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లఖినేని నారాయణరావు, సునీల్, దాలయ్య, బొత్స వెంకటరమణ, అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అవార్డును స్వీకరిస్తున్న రవికుమార్

లయన్స్ క్లబ్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌కు 2023-24 సంవత్సరానికి మెంబర్ షిప్ గ్రోత్ ఎక్స్‌లెన్స్ అవార్డును 316 - అంతర్జాతీయ లైన్స్ ప్రతినిధులు అందజేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన 43వ డిస్ట్రిక్ట్ వార్షిక అంతర్జాతీయ సమావేశాల్లో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు లయన్ పొన్నాడ రవికుమార్‌కు ఈఅవార్డును ఆదివారం రాత్రి అందజేశారు. లైన్స్ గవర్నర్ ఎ.గోపాలరావు, పిఐడి విజయకుమార్, రాజు అభినందించారు. కార్యక్రమంలో మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడిసింధూర పాల్గొన్నారు.

జగన్‌పై దాడికి కూటమిదే బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల్లో ఓటమి భయంతో సిఎం జగన్మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేయించారని, ఈ దాడి కూటమి నాయకుల ప్రమేయంతోనే జరిగిందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శిమ్మ రాజశేఖర్ ఆరోపించారు. సోమవారం నగరంలోని టౌన్ హాల్లో విలేకరులతో మాట్లాడారు. కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో ప్రజలెవరూ స్పందించడం లేదన్నారు. జగన్‌పై జరిగిన దాడిని ప్రధానితో పాటు ఇతర రాష్ట్రాల సిఎంలు, మంత్రులు ఖండిస్తుంటే కూటమి అభ్యర్థులు మాత్రం ఈ ఘటనను రాజకీయాలకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలిపిరి వద్ద చంద్రబాబు ఆడిన బాంబు డ్రామాను రాష్ట్ర ప్రజలు ఇంకా మార్చిపోలేదన్నారు. ఇప్పటికైనా ఇటువంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ప్రజలు తరిమికొడతారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ సుంకరి కృష్ణ. వైసిపి ఎస్‌సిసెల్ జిల్లా కన్వీనర్ పొన్నాడ రుషి, పనగాడ రామకృష్ణ, డిఎస్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

క్రీడా పాఠశాలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

విశాఖపట్నంలోని క్రీడా పాఠశాలకు కవిటి మండలం రాజపురం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. పదో తరగతి చదువుతున్న అంబటి సాయి, తొమ్మిదో తరగతి చదువుతున్న కప్ప అనుషా, బాకి వర్షిణి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 12,13 తేదీల్లో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు క్రీడా పాఠశాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.నేతాజీ అభినందించారు.

హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలను పునరుద్ధరించినట్టు పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు, హెడ్ పోస్టుమాస్టర్ దన్నాన చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ మందిరం అయోధ్య పిలాటలి కార్డులు, ఆల్బమ్‌లను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సమ్మాన్ అకౌంట్ కింద మహిళలకు ప్రత్యేకంగా ఖాతాలు తెరవనున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకుల నిర్లక్ష్యం... రైతులకు శాపం

నిరుపయోగంగా ఉన్న మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం

నిరుపయోగంగా మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం

ప్రజాశక్తి- టెక్కలి

గత ప్రభుత్వ పాలకుల అధికారుల నిర్లక్ష్యంతో మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకం నీరుగారిందనే చెప్పవచ్చు. వేలాది మంది రైతులకు సాగునీరు అందివ్వాలనే ఉద్దేశంతో నిర్మాణం చేపట్టిన ఎత్తిపోతల పథకం ఏడాది పాటు పనిచేశారు. తర్వాత పాలకుల అధికారుల నిర్లక్ష్యంతో నాలుగేళ్లుగా మూతపడి ఉంది. మండలంలోని నరసింగపల్లి, ముఖలింగాపురం, గూడెం పంచాయతీలోని సుమారు 21 గ్రామాలకు సంబంధించి సుమారు మూడు వేల మంది రైతులకు సాగునీరు అందాలనేఉద్దేశంతో రూ.37 లక్షల వ్యయంతో నాబార్డు నిధుల ద్వారా మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం పులను ప్రారంభించారు. 2019 డిసెంబరు 26న ఈ పథకాన్ని రైతాంగానికి అప్పటి మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అంకితం చేశారు. అయితే ఏడాది కాలంగా పని చేసిన ఈ పథకం ద్వారా ఈ ప్రాంత రైతులు ఏడాదికి రెండు పంటలు చొప్పున పండించుకున్నారు. అయితే వంశధార మెయిన్ కెనాల్ నుంచి 49.80 క్యూసెక్కుల నీరు సరఫరా జరగాల్సి ఉంది. ఈ నీరు ఎత్తిపోతల పథకానికి సరఫరా జరిగితే పలాస మండలంలోని శివారు ప్రాంతాలకు వంశధార సాగునీరందజేయలేమన్న సాకుతో వంశధార అధికారులు మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి నీటి సరఫరా నిలిపివేశారు నాలుగేళ్లుగా నిర్లక్ష్యంతో ఉన్న పథకాన్ని రైతులకు సాగునీరు అందించేందుకు వినియోగించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నా... పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ క్రమంలో నాలుగేళ్లుగా ఒక్క పంటను మాత్రమే పండించుకుంటూ రైతులు గడుపుతున్నారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన పథకం అకస్మాత్తుగా మూలన పడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే రాజకీయ దురుద్దేశంతోనే పథకాన్ని నిలుపుదల చేశారని ఈ ప్రాంత రైతుల అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ ప్రభావాన్ని రైతులు ప్రధాన ఆయుధంగా తీసుకొని అధికార వైసిపి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించనున్నట్లు సమాచారం. ఏదేమైనా రైతులకు అవసరమైన సాగునీరు సరఫరా నిలిపివేసి రైతులకు పంటలకు నీరులేకుండా చేసిన పాలకుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బస్సుయాత్ర విజయవంతం కావడంతో విజయవాడ కేంద్రంలో ఆయన హత్యాయత్నానికి చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ కుట్ర జరిపిరాని ఎమ్మెల్సీ, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. వైసిపి కార్యాలయం వద్ద వైసిపి నాయకులు బ్యాడ్జీలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు, దత్తపుత్రుడు, అచ్చెన్నాయుడు అత్యాయత్నానికి ప్రేరేపించారని అన్నారు. జగన్‌కి సంఘీభావం తెలిపాల్సింది పోయి విమర్శిస్తున్నారని అన్నారు. ఇటువంటి సంఘటన ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. కార్యక్రమంలో చింతాడ గణపతిరావు, గురునాథ్ యాదవ్, దవల కృష్ణారావు, చిగిలిపల్లి మోహనరావు, గాంధీ, కిల్లి అజయ్‌కుమార్, తమన్నగారి కిరణ్ పాల్గొన్నారు.

జగన్‌పై దాడి పిరికిపంద చర్య

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి పిరికిపంద చర్య అని, అందరూ ఖండించాలని సచివాలయాల మండల కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆ రాయి కొంచెం పక్కకు తగిలి ఉంటే ప్రాణానికే ప్రమాదమని జరిగేదని పేర్కొన్నారు. ఎయిర్‌గన్ లాంటి దానితో దాడిచేసినట్లు అనుమానంగా ఉందన్నారు. చేతితో విసిరి ఉంటే ఇంత బలంగాతగలదన్నారు. ఆకతాయిలు చేసిన పని కాదని, పక్కా ప్లాన్‌తో చేశారని అన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

19న నామినేషన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 19న నామినేషన్ వేస్తున్నానని దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు టెక్కలిలో కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్‌కు జనసమీకరణ చేపట్టాలని సూచించారు. వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకురావాలన్నారు. మరలా ఇంటికెళ్లే వరకూ బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో చింతాడ గణపతిరావు, దవళ కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, వైఎస్ ఎంపిపి మన్నెల కిషోర్, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్‌రెడ్డి, నాగళ్ల శంకరరావు, కిల్లి అజయ్‌కుమార్, తమన్నగారి కిరణ్ పాల్గొన్నారు.

కెవైబికి 69 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న కెవైబి మోటార్ సైకిల్ సస్పెన్షన్ ఇండియా కంపెనీకి టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24లో ఇసిఇ, ఇఇఇ, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థుల్లో 69 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో వ్రాత, మౌఖిక పరీక్షల జాబితాను పంపించారని అన్నారు. వార్షిక వేతనంగా ఒక్కొక్కరికీ రూ.3 లక్షల వరకు చెల్లించేందుకు ఆ కంపెనీ అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందిస్తూ క్రమశిక్షణతో శ్రమించి పనిచేస్తూ ఉన్నత స్థానాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఒడిలు డాక్టర్ బి.రామారావు, డాక్టర్ కె.కిరణ్ కుమార్, డాక్టర్ డి.శ్రీరాములు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.కుమార్ అభినందించారు.

ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం

రాష్ట్రాభివృద్ధి వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం లైదాంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ రేగడి లక్ష్మి, జమ్మినాయుడు, రామినాయుడు, దుంపల శ్యామల రావు, ప్రసాద్, రమణమ్మ, వాసుదేవరావు పాల్గొన్నారు.

18న అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ ఆవకాశాలపై ఈ నెల 18న ఉచిత అవగాహనా సదస్సు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు సదస్సు వల్ల విద్యార్థులకు విద్యుత్ జీవితం, విద్య, ఉన్నత లక్ష్యాలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కళాశాల బోటనీ లెక్చరర్ వాసుబాబు 9440360148 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు

మాట్లాడుతున్న జడ్జి చక్రవర్తి

టెక్కలి : మే నెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌దే ఆంతిమతీర్పుగా కక్షిదారులకు వివరించాలన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విషయమై కక్షిదారుల్లో అవగాహన కల్పించి కేసులు రాజీకి యత్నించాలని కోరారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, పి.వైకుంఠరావు పాణిగ్రాహి, మధుబాబు, పేడాడ బాబూరావు, దవళ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాలంటీర్ల రాజీనామా

రాజీనామాలు చేసిన వాలంటీర్లతో నాయకులు

ప్రజాశక్తి- కవిటి

వాలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగుతోంది. మండలంలోని మండలం దూగానపుట్టుగ పంచాయతీ పరిధిలో 10 మంది వాలంటీర్లు సోమవార ముకుమ్మడి రాజీనామాలు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి చిన్నారికి అందించారు. అనంతరం రాజీనామాలు చేసిన వాలంటీర్లను సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణస్వామి, దూగాన భద్రాచలం, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య అభినందించారు.

టెక్కలి రూరల్ : మండలంలోని బూర్గం పంచాయతీ పరిధిలో 17 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి జనపాన తిరమలరెడ్డి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని వెంకటాపురం, జాడుపల్లి, మర్రిపాడు-కె, వసుంధర, కోసమాల, మెళియాపుట్టి, పెద్దపద్మాపురం పంచాయతీల్లో 47 మంది వాలంటీర్లు మూకుమ్మడి సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి సేవ చేస్తుంటే... తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నారని అన్నారు.

తాగునీరు వృథా

రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

ప్రజాశక్తి- కవిటి

ప్రస్తుతం గుక్కెడు తాగునీటి కోసం కొన్ని కోట్లమంది అలమటిస్తుంటే తమ కళ్లెదుటే 20 రోజులకు పైగా తాగునీరు వృథాగాపోతున్నా సంబంధిత సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరించడం స్థానికంగా చర్చనీయాంసంగా మారింది. ముఖ్యంగా స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. మేజర్ పంచాయతీ కవిటిలో రామశెట్టి తిరుపతి ఇంటివద్ద పదిహేను రోజుల క్రితం ఉద్దానం తాగునీటి పథకం పైపులైను మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరు ధారాళంగా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ విషయాన్ని రామిశెట్టి తిరుపతితో పాటు స్థానికులూ సదరు ఉద్దానం తాగునీటి సిబ్బందికి తెలియజేశారు. సదరు వ్యక్తి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇది చాలా పెద్ద వ్యవహారం ప్రొక్లెయినర్ తేవాలని, మనుషుల అవసరం కూడా ఉంటుందంటూ కొన్ని రోజులు గడిపాడు. ఆ తరువాత స్థానికులు మళ్లీ సమస్యను అతని దృష్టికి తీసుకువెళ్తే... పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయండి తర్వాత చూద్దాం అంటూ వెళ్లిపోయాడు. ఆ తరువాత స్థానికంగా వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక రోజూ నిర్ణీత సమయం కంటే అధిక సమయం నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. కానీ, మరమ్మతులు మాత్రం చేయడం లేదు. దీనిపై స్థానికులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యమైన సిబ్బందిని తాము చూడలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాని అరికట్టాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

యాదవులు సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజకీయంగా యాదవులకు సమాజంలో గుర్తింపు నిచ్చింది రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాత్రమేనని, ఈసారి ఎన్నికల్లో యాదవులంతా సమిష్టిగా ఆయన విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని హయాతీనగరంలో యాదవ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చే నాయకుడు ధర్మాన కాదని, ఎల్లప్పుడూ తన కోసం పని చేసిన వారికి అండగా నిలుస్తారన్నారు. యాదవులకు పదవులు ఆయన నాయకత్వంలోనే సాధించుకోగలిగామన్నారు. సీమల తారక్ యాదవ్, అల్లబోయిన అప్పన్న అధ్యర్యాన జరిగిన ఈ సమావేశంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ నర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ యాదవులకు బిసి ఎ జాబితాలో చేర్చడానికి మంత్రి ధర్మాన పూర్తి సహకారం ఉందన్నారు. సమావేశంలో కవిటి ఎంపిపి కడియాల ప్రకాష్, అందాల శేషగిరి, గడ్డిబోయిన కృష్ణ యాదవ్, గురు రవి, బూర పాపారావు పాల్గొన్నారు.

కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో ఉపాధిహామీ పనులను చేపడుతున్న కూలీలకు సోమవారం స్థానిక వైద్య సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువుగా ఉన్న నేపథ్యంలో కూలీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బకు గురైతే చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్సలను కూలీలకు వివరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కొంచాడ లక్ష్మి, తెండేల రాజేశ్వరి, గోక ఉషారాణి, ఎఫ్ఎ రామినాయుడు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై రవికుమార్ ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలో పలు వీధుల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సోమవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను, అరాచకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికలలో గెలుపొందింతే కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. పొందూరు మాజీ ఉపసర్పంచ్, వైసిపి నాయకులు మలిపెద్ది పార్వతి, మలిపెద్ది శ్రీరంగనాయకులు, మేడ్చి చిన్నాతో పాటు పలు కుటుంబాలు కూన రవికుమార్ సమక్షంలో టిడిపి పార్టీలో చేరారు. వీరికి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంపిటిసిలు బాడాన హరిక, వాణి, నాయకులు కూన సత్యారావు, రాము పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

నాటక రంగానికే 'నాయక్'

నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

ప్రాచీన కాలంలో నాటక రంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. వీధి నాటకాలు, పగటి వేషాలు, బుర్ర కథలు, డ్రామాలు వేస్తూ ప్రజలను ఆనందింపజేసేవారు. ప్రస్తుతం సినిమాలు, సెల్‌లు, టివిలు రావడంతో నాటక రంగం కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. కానీ, వాటిని సజీవంగా కొనసాగించేందుకు కుమార్ నాయక్ తన జీవిత పర్యంతం శ్రమిస్తునే ఉన్నారు. తెలుగు నాట తొలినాటకం 'మంజరి మధుకరీం'. 1860లో కోరాడ రామచంద్ర శాస్త్రి రచించారు. 16 వ శతాబ్దం నాటి చిందు భాగవతం, యక్షగానం, వీధి బాగోతం నాటి కలు నేటికీ సజీవ సాక్ష్యాలు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా ఏప్రిల్ 16న ఏపి ప్రభుత్వం 2007లో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా కుమార్ నాయక్ పై ప్రత్యేక కథనం.

నాటక రంగంలో రాణిస్తున్న కుమార్ నాయక్ 1961లో పలాసలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు. సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంలో పట్టభద్రుడై 'జానపదుల జాడ యాడున్నదో' అనే అంశంపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గ్రామ దేవత ఉత్సవాల్లో కాలి అందియలకు మువ్వలు కట్టి 'కోయ డాన్స్' వీధి కార్యక్రమాలు ప్రదర్శించారు. తన 14వ ఏటలో 'చదువురాని సర్పంచ్' లఘునాటికతో కళారంగ ప్రస్థానం ప్రారంభించారు. నటునిగా, దర్శకునిగా, న్యాయ నిర్ణేతగా, సందర్భోచిత రచయితగా... కళామతల్లి సేవలో ఉన్నారు.

డాక్టర్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి గురజాడ నాటక కళా సమితి

నాయక్ నటించిన నాటికలు, నాటకాలు

అన్ సీజన్లో అల్లుడు నీతి నీ స్థానం ఎక్కడ?,. విజన్ 420, కొడుకే పుట్టాలా?, దాడి, లంకె బిందెలో లక్కాయి పిక్క, పిడికిలి, నాటు మందు, జాలరి జంగమయ్య, చిలక జోస్యం, భైరవకోన, జీవితం, కోయదర కొంటె దంపతులు, కంచం కదంటుంది, సోది సెబుతాను, కొత్త చిగురు, ఉత్తుంగ తరంగం, ట్రీట్మెంట్, చీడపురుగులు, తెలుగు నాటకాలతో పాటు ఒడియా నాటకాలైన బాణహరణం, దుర్ధశ, హిందీ నాటకమైన 'మిలాఖత్' నాటికలను పలు ప్రాంతాల్లో ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు...

పలు కళా సంస్థల్లో...

కళారూపాలను, కళాఖండాలను, సాహిత్యాలను, కళాకారులను ప్రోత్సహించాలని, పరిరక్షించాలనే తపనతో కళా సంస్థల ద్వారా సేవలందిస్తున్నారు. ఉషోదయ కళామండలి, సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక, కళింగ సీమ జానపద కళావేదిక, ఇండియన్ కల్చరల్ అసోసియేషన్, గ్రామీణ కళాకారుల సంక్షేమ సంస్థ, లలిత కళ రంజని, గురజాడ నాటక కళాసమితి, సహజ కళా సంస్థ, ఏపి జానపద కళాకారుల సంఘం, విశాఖరత్న కళా పరిషత్, శ్రీకాకుళ రంగస్థలం కళాకారుల సమాఖ్య, ఒడియా కళాకారుల సంఘం, క్రాంతి ఆర్ట్స్, పవనపుత్ర నాట్య కళా మండలి, నవజ్యోతి ఆర్ట్స్, రంగం ప్రజా సాంస్కృతిక వేదిక, భూలోకమ్మ ఆర్ట్స్, దాసరి కల్చరల్ అకాడమీ, శ్రీశ్రీ కళావేదిక, నటరాజ కళానికేతన్, కారుణ్య ఆర్ట్ క్రియేషన్ కళా సంస్థల్లో అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, సలహాదారునిగా, సభ్యునిగా సేవలు అందిస్తునే ఉన్నారు.

కళాసేవకు బిరుదులు

నాటక రంగంలో నిరంతరం సేవలందిస్తున్నందుకు గోపీకృష్ణ ఆర్ట్ థియేటర్ విజయవాడ, మనోరంజని సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ (తెలంగాణ), భిలాయి వాణి కల్చరల్ మ్యాగజైన్ భిలాయి (ఛత్తీస్‌ఘడ్) నిఖిల్ కొళకార్ సంఘ్ బరంపురం (ఒడిశా), జగదీశ్వర నాట్య కళామండలి హైడ్రో (అండమాన్) మూన్ కరాత్ కల్చరల్ అకాడమీ కలకత్తా (వెస్ట్ బెంగాల్) తిరుమన్నవల్లై సేవాసమితి అరుణాచలం (తమిళనాడు)లో రాష్ట్రస్థాయి సంస్థలచే కళా సవ్యసాచి, సరస్వతి జ్ఞానపీఠ్, కళాతేజం, తెలుగు భాషశ్రీ, కళారత్న, కళాసారధి, జానపద రత్న, గురు శ్రేష్ట బిరుదులు ప్రదానం చేశారు. అంతర్జాతీయ, జాతీయ కళాసంస్థలైన శ్రీశ్రీ కళావేదిక, ఇండియన్ కల్చరల్ అసోసియేషన్, ఆంధ్రా సారస్వత పరిషత్ వారిచే ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

అవార్డులు

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంత్యుత్సవాలు సందర్భంగా ఆర్కె కళా సంస్థ హైదరాబాదు వారు నిర్వహించిన వేడుకల్లో, జీవితం స్కిట్ ప్లేలో ఉత్తమ నటనకు నంది 2023 పురస్కారాన్ని అందుకున్నారు. గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వారు రాజమండ్రిలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దుర్ధశ ఒడియా నాటిక ఉత్తమ నటనకు నంది 2024 పురస్కారాన్ని అందుకున్నారు.

టిడిపి ఇంటింటా ప్రచారం

కవిటి : ప్రచారం చేస్తున్న నీలోత్పల

ప్రజాశక్తి- కవిటి

నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మరోసారి ఆదరించి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే భార్య నీలోత్పల కోరారు. మండలంలోని దూగానపుట్టుగలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నలభై ఏళ్లుగా తమ కుటుంబం ప్రజలతో మమేకమై ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం పూర్తిగా దిగజారిపోయిందని, అనుభవం లేని అహంకార పూరితమైన వ్యక్తి పాలనతో రాష్ట్రం దోపిడీకి గురైందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చంద్రబాబు మార్గదర్శనం అవసరమని అన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక వైశ్య వీధిలో టిడిపి ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకు మద్దతుగా టిడిపి నాయకులు బోయిన సత్యశ్రీనివాస్, బోయిన రుత్విక్, తంగుడు సునీల్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

నౌపడ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో సంతబొమ్మాళి మండలం యామలపేట సర్పంచ్ సంజీవ్ కుమార్ చేరారు. ప్రజాగళం కార్యక్రమానికి పలాస వచ్చిన చంద్రబాబును కలిసారు. చంద్రబాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు సంజీవ్ మాట్లాడుతూ ఉన్నతమైన ఉద్యోగం వదిలి గ్రామ అభివృద్ధికి వచ్చానని, అభివృద్ధి టిడిపి ద్వారా సాధ్యమని పార్టీలోకి చేరినట్లు ఆయన తెలిపారు.

నౌపడ : కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు నాయుడు

బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు

- తీర ప్రాంతాల్లో దాహం కేకలు
- ప్రభుత్వాలు మారుతున్నా శాశ్వత పరిష్కారానికి నోచుకోని వైనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తీరప్రాంత గ్రామాలైన డొంకూరు, శివకృష్ణాపురం, పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీ పురం గ్రామాల్లో ఏటా వేసవి నీటి కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా తీరప్రాంత నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం నేటి వరకు లభించలేదని తీర ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటుతుండడంతో బిందెడు నీటి కోసం బండెడు కష్టం పడుతున్నారు. నీటి ఎద్దడి కారణంగా చెలమల జలాన్ని వినియోగించి రోగాల పాలవుతున్నారు. ఇచ్ఛాపురంలో దాహార్తి తీర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వేకువజామున మహిళలు లేచి చెలమలు ద్వారా సేకరించిన నీటిని తీసుకెళ్తున్నారు. బిందెడు నీటికి పోరాటం చేస్తున్నారు. తీరా ప్రాంతాల్లో డొంకూరు, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాల్లో నీటి చుక్క కోసం పోరాటం నిత్యకృత్యమైపోయింది. మూడు వేల కుటుంబాలు నివసించే ఆ గ్రామాల్లో కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరానికి చేరుకొని ఇసుక దిబ్బలను లోతుగా తవ్వి కొంచెం కొంచెగా నీటిని సేకరిస్తారు. గంట తవ్వితే బిందె నీరు దొరుకుతుందని మహిళలు బాధతో చెబుతున్నారు. అక్కడే రెండు నుంచి మూడు గంటలు ఉంటాం. దీంతో ఉపాధి పనులకు వెళ్లాలన్నా, వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈ నీటి కష్టాలు తప్పడం లేదని, అధికార యంత్రాంగం తాత్కాలిక ఉపశమనం కలిగించే చర్యలు తప్ప... శాశ్వత పరిష్కారం వరకు చేపట్టలేదని వాపోయారు.

చెలమల ద్వారా నీటిని తోడుతున్న మహిళలు

చర్యలు తీసుకుంటాం

తీరప్రాంత గ్రామ పంచాయతీలో తాగునీరు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇ విష్ణుమూర్తి తెలిపారు. ఉద్దానం నీటి సరఫరా పథకం నుంచి నేరుగా డొంకూరు ట్యాంకర్‌కు కనెక్షన్ ఇస్తున్నామని అన్నారు. దీంతో పాటు తీర ప్రాంతంలో ప్రత్యేకంగా బావి తవ్విస్తున్నామని తెలిపారు. మూడు రోజుల్లో గ్రామాలకు తాగునీరు అందించే చర్యలు తీసుకున్నామని చెప్పారు.